క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలసిన ఎమ్మెల్సీ తోట



తాడేపల్లిలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మంగళవారం కలిశారు. ఈ మేరకు తాడేపల్లిలోని క్యాంపు ఆఫీస్‌లో భేటీయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు రాజకీయ అంశాలపై చర్చించారు. కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయనకు సూచించినట్లు పేర్కొన్నారు.

మండలానికి చేరుకున్న విద్యా సామగ్రి

కపిలేశ్వరపురం: ఈ నెల 12న ప్రభుత్వ పాఠశాలలు తెరుచుకోనున్న నేపథ్యంలో విద్యార్థుల కోసం విద్యా సామాగ్రిని అధికారులు సిద్ధం చేస్తున్నారు. మండలంలోని అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పుస్తక నిక్షిప్త కేంద్రానికి మంగళవారం విద్యా సామాగ్రి చేరుకుంది. ఎంఈఓ కె.తాతారావు మాట్లాడుతూ 1,690 బెల్ట్‌లు, 288 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, 17,912 నోట్ పుస్తకాలు, 2,656 బ్యాగ్‌లు, 2,290 వర్క్ బుక్స్, 12,246 పాఠ్య పుస్తకాలు మండలానికి చేరుకున్నాయన్నారు. మరో 23 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉందన్నారు. సామాగ్రిని పాఠశాలలు, తరగతులు వారీగా విభజించి హెచ్‌ఎంలకు అందజేయనున్నట్టు ఎంఈఓ తాతారావు తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎస్ టి.సురేష్, సీఆర్పీలు, కొండేటి సరిత, శీలం వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి మృతి

కాజులూరు: గొల్లపాలెం శివారు ధనలక్ష్మీపేటకు చెందిన సుధరపల్లి శేషారావు (39) చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి మంగళవారం స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. సుధరపల్లి శేషారావుకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. అయితే కుటుంబాన్ని పట్టించుకోకుండా మద్యానికి బానిసై దుబారా ఖర్చులు పెడుతుండటంతో గత రెండు రోజుల క్రితం భార్య జ్యోతి అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో శేషారావు తీవ్ర మనస్థాపం చెంది సోమవారం గ్రామ శివార్లలోని చుండ్రు సీతాంబరం గారి మామిడితోటలో జీడిమామిడి చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారమివ్వగా పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి



కపిలేశ్వరపురం ఎంపీడీఓ కార్యాలయం వద్ద పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ

కపిలేశ్వరపురం: ఆధునిక సమాజంలో ప్రతి మనిషి విజ్ఞానంతో జీవించాల్సిన అవసరం ఉందని, చిన్నారులందరికీ విద్యా బుద్ధులను చెప్పించే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఈనెల 12న ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం నేపథ్యంలో మంగళవారం శ్రమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూపొందిచిన వాల్ పోస్టర్‌ను ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఆవిష్కరించారు. సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జిల్లెళ్ల శేషగిరిరావు పర్యవేక్షణలో మంగళవారం నుంచి ఈ నెల 12 వరకూ మండలంలోని గ్రామాల్లో బాల కార్మిక వ్యతిరేక అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామని సంస్థ కో–ఆర్డినేటర్ నాగేశ్వరి పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి బాల కార్మికులను గుర్తించి, వారిని పనిలోకి పెట్టుకున్నవారిపై ఫిర్యాదు చేసి, బాలల హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రమణయ్య, భవాని, శారద, దుర్గారావు, నాగరాజు పాల్గొన్నారు.

రైతు బజార్‌కు ఎట్టకేలకు మోక్షం



ప్రారంభానికి సిద్ధమైన రైతుబజార్

రామచంద్రపురం: గత కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్న రైతుబజార్‌కు నేటికి మోక్షం కలగనుంది. రామచంద్రపురం నడిబొడ్డున కిషోర్ థియేటర్ ఎదురుగా నిర్మించిన రైతుబజార్‌ను మంత్రి వాసంశెట్టి సుభాష్ నేడు ప్రారంభించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చొరవతో మార్కెటింగ్ శాఖ నుంచి సుమారుగా రూ.కోటి నిధులు మంజూరు చేయించి రైతుబజార్ నిర్మించారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో అప్పట్లో రైతుబజార్ ప్రారంభానికి నోచుకోలేదు. గత ప్రభుత్వ హయాంలోనే రైతుబజార్ పూర్తి కావచ్చినా ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రైతుబజార్ ప్రారంభానికి నోచుకోవడంతో పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

‘సాక్షి’పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



కె.గంగవరం ఎస్సై జానీబాషాకు వినతి పత్రం ఇస్తున్న విలేకరులు



గొల్లపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న విలేకరులు

కాజులూరు: సాక్షి కార్యాలయాలపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తాడి వీరవెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రెస్‌క్లబ్ సభ్యులు గొల్లపాలెం పోలీస్‌స్టేషన్‌ల్లో ఫిర్యాదు చేశారు. చానల్ డిబేట్‌లో ఓ జర్నలిస్టు మాట్లాడిన దానిపై కొమ్మినేని క్షమాపణలు చెప్పినా దీనిని రాద్ధాంతం చేయడం తగదన్నారు. దాడి చేస్తున్న నిందితులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: గత రెండు రోజులుగా సాక్షి దినపత్రిక, చానల్‌పై జరుగుతున్న దాడులకు నిరసనగా సాక్షి అభిమానులు మంగళవారం కె.గంగవరం పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. మండల కేంద్రమైన కె.గంగవరం పోలీస్‌స్టేషన్ వద్ద సాక్షిపై జరుగుతున్న దాడులపై సామాన్య ప్రజలు, అభిమానులు నిరసన వ్యక్తం చేస్తూ స్థానిక ఎస్సై జానీబాషాకు దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సాక్షి విలేకరి నరాల కిరణ్, జంగం ధనరాజు, మేడిశెట్టి గోవిందరాజు, జంగం సత్తిబాబు, కొప్పుల నాగన్న, వల్లు శ్రీను, వెంటపల్లి సతీష్‌కుమార్ (నాని), కాదా సత్యనారాయణ, నీల వీరవెంకటరమణ, దార సత్యనారాయణ, నీల రుద్రకుమార్, నీల వీరవెంకట సత్యనారాయణ, పలివెల సురేష్, జంగం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

‘సాక్షి’పై దాడి అప్రజాస్వామికం

కపిలేశ్వరపురం: సమస్యలను వెలుగులోకి తెస్తూ ప్రజల పక్షం వహిస్తోన్న ‘సాక్షి’ మీడియాపై రాష్ట్రంలో జరుపుతున్న దాడి అప్రజాస్వామికమని సీనియర్ విలేకరులు పెద్దింశెట్టి లెనిన్‌బాబు, కోశెట్టి దేవసహాయం అన్నారు. సాక్షి ఛానల్‌లో ప్రసారమైన చర్చా వేదికలో రాజధాని అమరావతిపై ఓ జర్నలిస్టు తెలిపిన తన వ్యక్తిగత అభిప్రాయాన్ని సాక్షి మీడియాకు, చర్చా వేదికను నిర్వహిస్తోన్న కొమ్మినేని శ్రీనివాసరావుకు ఆపాదిస్తూ రాష్ట్రంలో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఇదంతా కొందరి ఉద్దేశపూర్వకమైన కుట్రగా భావిస్తున్నామన్నారు. సమాజంలో వ్యతిరేక అభిప్రాయాలు కలిగి ఉండటం సహజమనీ, వ్యతిరేకించే అంశాలను ప్రజాస్వామ్యయుతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందన్నారు. ఈ ప్రజాస్వామిక పద్ధతులను విస్మరిస్తూ సాక్షి యూనిట్ కార్యాలయాలపైనా, ఉద్యోగులపైనా, విలేకరులపైనా భౌతిక దాడులకు దిగడం సరికాదన్నారు. రాష్ట్రంలో సాక్షి కార్యాలయాలపై దాడులకు పాల్పడినవారిపై చట్ట పరిధిలో కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని లెనిన్‌బాబు కోరారు. ఆ మేరకు ఫిర్యాదును పోలీసులకు అందజేశారు.

ప్రజల ఆరోగ్య నాణ్యతపై సర్వే



తాతపూడిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న వైద్య బృందం, విద్యార్థులు

కపిలేశ్వరపురం: క్షేత్ర స్థాయిలో ప్రజల ఆరోగ్య అంశాల్లో నాణ్యతపై ప్రత్యేక సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా క్వాలిటీ అసెస్‌మెంట్ సర్వే పేరుతో ఎస్‌పీఎం డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలోని కమ్యూనిటీ మెడిసిన్ విభాగం హెచ్‌ఓడీ డా.పి.సుజాత ఆధ్వర్యంలోని 25 మంది పీజీ విద్యార్థులు మంగళవారం తాతపూడి గ్రామంలో పర్యటించారు. వారంతా నాలుగు బృందాలుగా విడివడి గతంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది చేసిన ఎన్‌సీడీ 3.0 సర్వే తీరును, సర్వే చేయడంలోని నాణ్యతను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి నివేదికను రూపొందించారు. సర్వేలో గుర్తించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని డాక్టర్ సుజాత అన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కార్యదర్శి బ్రహ్మాజీ, ప్రోగ్రాం ఆఫీసర్ డా.పి. సుమలత, అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి డా.పీఎస్‌ఎస్‌డీ రత్నకుమారి ఎంపీహెచ్‌ఈఓ జుత్తుక మల్లిఖార్జునుడు, హెచ్‌ఈ బి.రామారావు, హెల్త్ విజిటర్ తాతపూడి మేరీ మణి, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బడిబాట పట్టిన ఆర్టీసీ

- ఆర్టీసీ ఉచిత బస్సు పాసుల జారీ
- 7వ తరగతి వరకు బాలురకు, టెన్త్ వరకు బాలికలకు
- పల్లె విద్యార్థులకు ప్రయోజనం
- రెన్యువల్, నూతన పాసుల జారీకి చర్యలు



ఆర్టీసీ బస్సు

రాయవరం: విద్యార్థులకు రవాణా చార్జీల భారం తగ్గించేందుకు ఏటా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత, రాయితీ పాసులు ఇస్తోంది. ఈ నెల 2వ తేది నుంచి జూనియర్ కళాశాలలు ప్రారంభం కాగా, ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. రెండు నెలల సెలవుల తరువాత తిరిగి విద్యాసంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో బస్సు పాస్ కౌంటర్లు ప్రారంభించారు. స్థానికంగా సరైన విద్యా సంస్థలు లేకపోవడం, హాస్టల్ సీటు రాకపోవడం, గది అద్దెకు తీసుకునే ఆర్థిక స్థోమత లేకపోవడం లాంటి కారణాలతో విద్యార్థులు బస్సు పాసులు పొంది రాకపోకలు సాగిస్తుంటారు. రామచంద్రపురం డిపో పరిధిలో విద్యార్థులు ఆర్టీసీ బస్ పాస్‌లు పొంది ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తూ చదువుకుంటున్నారు. ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేటు సంస్థల్లో చదివే విద్యార్థులకు పాసులు మంజూరు చేస్తారు.

నిబంధనలివీ

- ఏపీఎస్ ఆర్టీసీ ఆన్‌లైన్ వెబ్ సైట్లో వివరాలు నమోదు చేసుకొని దరఖాస్తు చేసుకోవాలి.
- కళాశాల విద్యార్థులు 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలు జత చేయాలి. స్టడీ సర్టిఫికెట్తో పాటు రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలు, సెల్ నంబర్‌ను జత ఇవ్వాలి.
- దరఖాస్తులను డిపో మేనేజర్ పరిశీలించి పాసు మంజూరుకు సిఫార్సు చేస్తారు. వీటిని మంజూరు కౌంటరులో ఇచ్చి నిర్ణీత డబ్బు చెల్లించి విద్యాసంస్థల సమీపంలోని బస్ డిపోల్లో ఈ పాసులు పొందవచ్చు.

ఎవరికిస్తారంటే..

అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు 7వ తరగతి వరకు బాలురు, 10వ తరగతి వరకు బాలికలకు ఉచితంగా బస్ పాసులు ఇస్తారు. ఇవి ఏడాది వరకు చెల్లుబాటవుతాయి. మిగతా వారికి రాయితీతో పాసులు మంజూరు చేస్తారు. పాసు ధరతో పాటు సంవత్సర గుర్తింపు కార్డు కోసం రూ.1,00, నెలవారి గుర్తింపు కార్డు రూ.50, సర్వీసు చార్జీ రూ.40 విద్యార్థులు చదివే విద్యాసంస్థలు లేక నివాసానికి అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

పాసుల కాలపరిమితి

రాయితీ పాసులు నెల, మూడు నెలలు, ఏడాది కాల పరిమితితో మంజూరు చేస్తున్నారు. గడువు ముగిశాక రెన్యూవల్ కోసం ప్రిన్సిపాల్ సంతకం చేయించుకుని వెళ్లాలి. సాధారణ విద్యార్థులకు జూన్ నుంచి ఏప్రిల్ వరకు, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, బీఈడీ, మెడిసిన్, పారా మెడికల్ లాంటి కోర్సులు చదివే వారికి మే నెలలో కూడా పాసులు మంజూరు చేస్తారు. ప్రతి 5 కి.మీలకు ఒక స్టేజీగా పరిగణలోకి తీసుకొని దూరాన్ని బట్టి రాయితీ కల్పిస్తారు.

సద్వినియోగం చేసుకోండి



ప్రభుత్వం అందించే బస్సు పాసులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం నెలవారీగా, మూడు నెలలు, ఏడాది కాల పరిమితితో పాసులు జారీ చేస్తున్నాం. దరఖాస్తునకు ఆధార్, స్టడీ సర్టిఫికెట్ జిరాక్సులు, కళాశాల విద్యార్థులు 10వ తరగతి మార్కుల జాబితా జిరాక్సును జత చేసి సమీపంలోని కౌంటరులో ఇచ్చి పాసులు పొందవచ్చు. 50 కి.మీ పరిధి వరకు బస్సు పాసులు మంజూరు చేస్తున్నాం.

పి.భాస్కరరావు, డిపో మేనేజర్, రామచంద్రపురం

డిపో పరిధిలో..

రామచంద్రపురం డిపో పరిధిలో రామచంద్రపురం, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాలకు చెందిన విద్యార్థులతో పాటుగా, ఇతర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కూడా బస్‌పాస్‌లు పొందుతున్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి నూతన బస్‌పాస్‌ల మంజూరు ప్రారంభించారు. గత విద్యా సంవత్సరంలో డిపో పరిధిలో 12 ఏళ్ల లోపు బాలురు, 18ఏళ్ల లోపు బాలికలకు ఉచిత బస్సు పాసులు 8,500 వరకు మంజూరు చేయగా, స్టూడెంట్ రాయితీ బస్‌పాస్‌లు సుమారుగా 18వేలు మంజూరు చేశారు. మంత్లీ సీజన్ పాసులు 2,340, దివ్యాంగుల రాయితీ పాసులు 1,250 మంజూరు చేశారు. నూతనంగా బస్‌పాస్‌లు పొందే విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్ /ఆన్‌లైన్.ఏపీఎస్‌ఆర్‌టీసీ.ఇన్ నందు రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంది. బస్‌పాస్ అప్లికేషన్‌పై కళాశాల ప్రిన్సిపాల్‌తో సర్టిఫై చేయించుకుని వస్తే వెంటనే బస్‌పాస్ జారీకి చర్యలు చేపడుతున్నారు.

వెల్లలో వికసిత కృషి సంకల్ప అభియాన్



వెల్లలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల గ్రామంలో మండల వ్యవసాయాధికారి ఎస్..సత్యప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం వికసిత కృషి సంకల్ప అభియాన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ వై.జ్యోతిర్మయి, ఐసీఏఆర్, ఎన్ఐఆర్‌సీఏ శాస్త్రవేత్త డాక్టర్ కె.రాజశేఖరరావు, డీఏటీటీసీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.నందకిషోర్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా అందుతున్న ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, పరంపరాగల్ కృషి వికాస్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు తదితర అంశాలతో పాటు ఖరీఫ్ పంటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ బీవీవీ సత్యనారాయణ, వెల్ల ఎంపీటీసీ చిక్కాల స్వామికాపు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి



రైతులకు కరపత్రాలు పంచుతూ ధర్నాకి రావాలంటూ ఆహ్వానిస్తున్న రాజబాబు తదితరులు

కాజులూరు: రాష్ట్రంలో రైతాంగం పట్ల ప్రభుత్వం అవలంభిస్తున్న నిరంకుశ వైఖరిని నిరసిస్తూ బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. ఈ మేరకు మంగళవారం రాజబాబు తదితర కౌలురైతు సంఘాల నాయకులు మండలంలోని కోలంక, పల్లిపాలెం, నామవానిపాలెం తదితర గ్రామాల్లో పర్యటించి ధర్నాకు హాజరు కావలసిందిగా రైతులను ఆహ్వానించారు. పల్లిపాలెంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కౌలు రైతుల సంక్షేమం కోసం నూతన చట్టాలను తీసుకొస్తామని ప్రభుత్వం ప్రకటించిందని ఏడాది గడుస్తున్నా రైతుల అభివృద్ధి కోసం ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన అన్నదాతా సుఖీభవ పథకం నేటికి కార్యరూపం దాల్చలేదని, రైతు సేవాకేంద్రాలు ఉత్సవ విగ్రహాలుగా మారాయన్నారు. కనీసం ప్రభుత్వం సీఎంఆర్ ద్వారా సక్రమంగా ధాన్యం కొనుగోలు చేయకపోవటంతో రైతులు దళారులకు అయినకాడికి అమ్ముకోవలసి వచ్చిందన్నారు. ఒట్లు కోసం ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలిచ్చిన పాలకులు ‘ఓడదాటే వరకూ ఓడ మల్లయ్య, ఓడ దాటాక బోడిమల్లయ్య’ అన్న చందాన వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య విధానాలను నిరసిస్తూ చేపట్టిన ఈ ధర్నా కార్యక్రమాన్ని రైతులందరూ విజయవంతం చేయాలన్నారు.

హామీలు నెరవేర్చకపోతే తిరుగుబాటు తప్పదు



ద్రాక్షారామలో విద్యార్థి సంఘం సమావేశంలో మాట్లాడుతున్న సిద్దూ

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఇచ్చిన హామీలను తక్షణం నెరవేర్చకపోతే తిరుగుబాటు తప్పదని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దూ హెచ్చరించారు. ద్రాక్షారామలో గుర్రాల పరంజ్యోతి స్మారక గ్రంథాలయంలో పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న దృష్ట్యా ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన ఎన్నికల హామీలను వారికి గుర్తు చేయాల్సి వస్తుందన్నారు. ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం పేరుతో రూ.15 వేలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్పులు, ప్రభుత్వ యూనివర్సిటీలు, పాఠశాలలు, హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాల కోసం బడ్జెట్‌లో అధిక కేటాయింపులు, మెగా డీఎస్సీ ద్వారా 50 వేల టీచర్ పోస్టుల భర్తీ, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, విద్యా హక్కు చట్టం పటిష్ట అమలు ద్వారా కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో దోపిడీ అరికట్టడం, జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ వంటి హామీలు గుప్పించి ఏడాది గడచినా అమలు చేయకపోయినా సంబరాలు మాత్రం చేసుకుంటున్నారని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తు గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి జూన్ 15లోగా తల్లికి వందనం, రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ ఉన్న పాత, కొత్త బకాయిలు 8 వేల కోట్లు విడుదల చేయాలని, 2025–26 విద్యా సంవత్సరంలో కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ఎం.మణికంఠ, కె.సునందన్, వి.సుమంత్, పి.బద్రీనాథ్, వి.సాయివినోద్, పి.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

రామచంద్రపురం రూరల్: అదనపు కట్నం తీసుకురావాలని భర్త, అత్తమామలు తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని రామచంద్రపురం మండలం వెలంపాలేనికి చెందిన కోలా సత్యవేణి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ మంగళవారం విలేకరులకు తెలిపారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం ఆమెకు కె.గంగవరం మండలం బాలాంత్రానికి చెందిన వీరాంజనేయులుతో 2018లో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ.6 లక్షలు కట్నంతో పాటు లాంఛనాలు ముట్టజెప్పారు. ప్రస్తుతం మరో రూ.2 లక్షలు తీసుకురావాలని వేధిస్తుండటంతో ఫిర్యాదు చేయగా ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డ్వాక్రా సొమ్ము స్వాహా..!

- బ్యాంకు ఖాతాలో సొమ్ము మాయం
- రూ.32.40 లక్షల నగదు మాయంపై ఫిర్యాదు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న డ్వాక్రా మహిళలు



రాయవరం పోలీస్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా శక్తి సంఘాలు

రాయవరం: నెల నెలా దాచుకున్న పొదుపు సొమ్ముతో పాటుగా, బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలకు సంబంధించిన వాయిదాలను వారంతా సక్రమంగా చెల్లిస్తున్నారు. రుణం సక్రమంగా చెల్లించిన డ్వాక్రా మహిళలు తిరిగి రుణాన్ని పొందేందుకు బ్యాంకుకు వెళ్లగా వారు జమ చేసిన సొమ్ము బ్యాంకులో జమ కాని విషయాన్ని బ్యాంకు అధికారులు తెలపడంతో డ్వాక్రా మహిళలు అవాక్కయ్యారు. బ్యాంకు బీసీ పాయింట్‌లో కట్టించుకున్న సొమ్ము వారి ఖాతాల్లో జమ చేయకుండా కరస్పాండెంట్ స్వంతానికి వాడుకున్నట్లుగా ప్రాథమికంగా గుర్తించారు. రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన 26 మహిళా శక్తి సంఘాలకు చెందిన రూ.32.40 లక్షల సొమ్ము పక్కదారి పట్టినట్లుగా తేలింది.

వివరాలిలా

మండలంలోని సోమేశ్వరం గ్రామానికి చెందిన 42 మహిళా శక్తి సంఘాలు గ్రామ పరిధిలోని ఎస్‌బీఐ బ్రాంచిలో రుణాలను తీసుకుని సక్రమంగా చెల్లిస్తున్నాయి. రుణ వాయిదాలతో పాటుగా, నెల నెలా పొదుపు సొమ్మును బ్యాంకుకు చెల్లిస్తున్నారు. గ్రామానికి బ్రాంచి దూరంగా ఉండడంతో గ్రామంలో రుణాలు, పొదుపు సొమ్మును కట్టించుకునేందుకు బ్యాంకు ఏర్పాటు చేసిన కస్టమర్ సర్వీస్ పాయింట్ ఏర్పాటు చేసి, ఏజెంట్‌ను నియమించారు. కస్టమర్ సర్వీస్ పాయింట్‌లో బ్యాంకు ఏర్పాటు చేసిన ఏజెంట్ టి.గణేష్‌బాబు పొదుపు, రుణాల సొమ్మును ఏరోజుకారోజు బ్యాంకులో జమ చేయాల్సి ఉంది. అయితే డ్వాక్రా మహిళలు చెల్లించిన సొమ్మును కస్టమర్ సర్వీస్ పాయింట్ ఏజెంట్ సొంతానికి వాడుకుని, కొంత మొత్తాన్ని మాత్రమే అకౌంట్లకు బదిలీ చేసినట్లుగా డ్వాక్రా మహిళలు ఆరోపిస్తున్నారు. సక్రమంగా రుణాలు చెల్లించిన మహిళా శక్తి సంఘాలు తిరిగి బ్యాంకు రుణం తీసుకునేందుకు బ్యాంకుకు వెళ్లగా రుణం చెల్లించాల్సి ఉందని చెప్పడంతో విషయం వెలుగు చూసింది. మహిళా శక్తి సంఘాలు బ్యాంకు వారిని స్టేట్‌మెంట్లు కోరగా, 20 సంఘాలకు చెందిన స్టేట్‌మెంట్లు ఇవ్వగా, రూ.32.40 లక్షలు జమ కాలేనట్లుగా గుర్తించారు.

ఆరు సంఘాల స్టేట్‌మెంట్లు రావాలి

ఇంకా ఆరు సంఘాల స్టేట్‌మెంట్లు ఇవ్వాల్సి ఉందని డ్వాక్రా మహిళలు చెబుతున్నారు. మిగిలిన ఆరు సంఘాల స్టేట్‌మెంట్ వస్తే మొత్తం ఎంత సొమ్ము జమకాలేదనే విషయం బయటపడుతుంది. బ్యాంకుకు జమకాని సొమ్మును మహిళా శక్తి సంఘాల ఖాతాలకు జమ చేయాలని, బ్యాంకు కస్టమర్ సర్వీస్ పాయింట్ ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలని డ్వాక్రా మహిళలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై రాయవరం పోలీస్‌స్టేషన్ వద్ద రాయవరం మండల మహిళా శక్తి సంఘాల అధ్యక్షురాలు కె.శ్రీదేవి ఆధ్వర్యంలో సోమేశ్వరం గ్రామానికి చెందిన మహిళా శక్తి సంఘాలు ఫిర్యాదు చేశాయి. ఖాతాలకు జమకాని సొమ్మును ఖాతాలకు జమ చేయించాలని వారు డిమాండ్ చేశారు. మండల యానిమేటర్లు, ఏపీఎం కె.నాగేశ్వరరావు బాధిత మహిళా శక్తి సంఘాలకు బాసటగా నిలిచారు. దీనిపై బ్యాంకు మేనేజరు భూషణ్‌దేవ్‌ను వివరణ కోరగా మహిళా శక్తి సంఘాలు ఇచ్చిన ఫిర్యాదుపై శాఖాపరంగా విచారణ చేసి, చర్యలు తీసుకుంటామన్నారు. రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబును వివరణ కోరగా డ్వాక్రా మహిళలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

కిశోరి వికాసంపై అవగాహన



రామచంద్రపురం శాంతినగరంలో కిశోరి వికాసం అవగాహన కార్యక్రమం



పసలపూడిలో కిశోరి బాలికలతో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రామచంద్రపురం: పట్టణంలోని శాంతినగరం అంగన్‌వాడీ కేంద్రం వద్ద రామచంద్రపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కిశోరి వికాసం అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సీడీపీఓ వీవీ వరాహలక్ష్మి మాట్లాడుతూ మే నెల 2 నుంచి ఈ నెల 10 వరకు కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించినట్లు ఆమె తెలిపారు. 11 నుంచి 16 సంవత్సరాల పిల్లల్లో రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత అంశాలపై అవగాహన కల్పించారు. ఎదిగిన పిల్లల్లో పీరియడ్స్ సమయంలో ప్యాడ్స్ వాడకంపై వివరించారు. ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

‘కిశోరి వికాసం’పై ప్రణాళిక సమావేశం

కపిలేశ్వరపురం (మండపేట): క్షేత్ర స్థాయిలో కిశోర బాలికల అభ్యున్నతికై చేపట్టాల్సిన కార్యక్రమాలను రూపొందించే లక్ష్యంతో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్టు పరిధి మారేడుబాకలో మంగళవారం సర్పంచ్ గోవిందరాజు అధ్యక్షతన కిశోరి వికాసం వేసవి శిక్షణా కార్యక్రమాల ప్రణాళికపై పలు శాఖల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో చర్చించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ నాగశ్రీదేవి మాట్లాడుతూ బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నామన్నారు. ఉన్నతాధికారుల కార్యక్రమాల దృష్టికి తీసుకెళ్లి ప్రణాళికను అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రసాద్, ఏఎంఎన్ పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు విమల, రాజేశ్వరి, జ్యోతి, ఆశ కార్యకర్తలు అరుణదేవి, ఉమాదేవి, ఆయాలు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై ర్యాలీ

రాయవరం: మండలంలోని పసలపూడిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై బాలికలతో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోరి బాలికలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.విష్ణుకుమారి అవగాహన కల్పించారు. కిశోరి బాలికల ప్రాధాన్యత, పౌష్టికాహారంతో కలిగే ప్రయోజనాలు, రుతుస్రావం, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, బాలల హక్కుల రక్షణ, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, నాయకత్వ లక్షణాలు గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలో ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్టు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. పట్టణంలోని 14వార్డులో పురపాలక సంఘం సాధారణ నిధులు రూ. రూ.19 లక్షలు అంచనా వ్యయంతో నిర్మించిన బీసీ సామాజిక భవనం, 19వ వార్డులో రూ.43.87 లక్షలతో మౌళిక సదుపాయాలతో ఆధునీకరించిన డొక్కా సీతమ్మ మహిళా స్వశక్తి భవనాలను మంగళవారం ప్రారంభించారు. సామాజిక భవనాలు మానవ సమూహాల్లో ఐక్యతకు దోహదపడతాయని ఎమ్మెల్యే అన్నారు. కమిషనర్ రంగారావు, వైస్ చైర్మన్ వేగుళ్ల నారయ్య బాబు, వార్డు కౌన్సిలర్‌లు, పురపాలక సంఘం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.